సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



కక్ష సాధింపేనా..?

పాత కేసులో ననపల సురేష్ అరెస్టయ్యారు. టీడీపీతో తిరిగినందుకేనా ఈ శిక్ష అని ఆయన ప్రశ్నిస్తున్నారు. - 8లో



పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి మండలంలో ఓ మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ చేశారు. ఇంటిలోకి వచ్చి మరీ దొంగిలించారు. - 8లో

మత్స్యసంపద యోజనపై దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన లబ్ధిదారులకు వంద శాతం అందజేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన జిల్లా స్థాయి కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఏకలవ్య ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

పాతపట్నం: పాతపట్నం ఐటీడీఏలో నడుపుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (మెళియాపుట్టి)లో ఇటీవల 7వ తరగతి విద్యార్థిని నవర లావణ్య ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనలో.. సకాలంలో స్పందించపోవడం, అలసత్వం వహించడం వంటి కారణాల వల్ల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరిలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించినట్లు పీఓ తెలిపారు.

నవంబరు 6 వరకు ఉపాధ్యాయ ఓటర్ల నమోదు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి సెప్టెంబర్ 30వ తేదీన నోటిఫికేషన్ వెలువడిందని, అదే రోజు నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. నవంబరు 6 ఓటరు నమోదుకు చివరి తేదీగా నిర్ణయించామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ప్రాంతీయ ఇంటర్మీడియెట్ అధికారి కె.తవిటి నాయుడు, సి సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి 29వ తేదీకి ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గడువు ముగుస్తుందని, ఈ నేపథ్యంలో సంబంధిత ఓటర్ల జాబితా రూపకల్పనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. గతంలో ఓటు ఉన్న వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని, పాత ఓటు చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు.

మరుగుదొడ్లను శుభ్రం చేశారు




మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంఈఓ చిన్నారావు

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి: టెక్కలి మెయిన్ స్కూల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను శనివారం పరిశుభ్రం చేశారు. స్కూల్‌లోని మరుగుదొడ్ల పరిస్థితిపై శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో మండల విద్యా శాఖాధికారి బి.చిన్నారావు పాఠశాలకు చేరుకుని మరుగుదొడ్ల పరిశుభ్రతపై ఆరా తీశారు. పాఠశాల సిబ్బందితో మరుగుదొడ్లు పరిశుభ్రం చేయించారు.

జీవనశైలి



వాయువు నీ ఆయువును పెంచుతుంది. అగ్ని నీ అనారోగ్యాన్ని దహించివేస్తుంది. జలం బతుకు గరళాన్ని హరిస్తుంది. ఆకాశం ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. తల్లి భూదేవి మనకు అండగా ఉంటుంది. ఏళ్లకు ఏళ్ల రసాయనాలు కడుపులో వేసుకుని అలసిపోయిన వారికి ఇప్పుడు ఈ పంచభూతాలే రక్షగా నిలబడుతున్నాయి. దీర్ఘకాల అనారోగ్య సమస్యలకు చక్కటి పరిష్కార మార్గంగా కనబడుతున్నాయి. ఇంగ్లిష్ మందులకు, ఆపరేషన్లకు భయపడేవారికి 'నేచురోపతి' సమర్థ ప్రత్యామ్నాయంగా ఎదుగుతోంది. జిల్లా కేంద్రంలోనూ ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. - శ్రీకాకుళం కల్చరల్



పంచభూతాలే రక్ష

- నేచురోపతికి పెరుగుతున్న ఆదరణ
- పంచభూతాల సాయంతో వైద్యం
- దీర్ఘకాల ఆరోగ్య సమస్యలకు చక్కటి పరిష్కారం

SUNDAY SPECIAL

దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను ప్రకృతి వైద్యం ఇట్టే నయం చేస్తోంది. సుగర్, బీపీ, థైరాయిడ్, సైనసైటిస్, ఆస్తమా, మైగ్రేన్ తలనొప్పి, గ్యాస్, ఒబెసిటీ, బరువు సమస్య, పీసీఓడీ, రుతు సమస్య, ఒత్తిడి, స్ట్రెస్, యాంగ్జైటీ, డిప్రెషన్, నడుం నొప్పి, మోకాలినొప్పి, వెన్ను, భుజాలు, సయాటికా తదితర వ్యాధులను ప్రకృతి వైద్యం ద్వారా నయం చేస్తున్నారు. ఈ ప్రకృతి చికిత్సలో వ్యాధి తగ్గడమే కాదు.. వ్యాధికి గురైన రోగి శరీరం మొత్తం చికిత్స పొంది యథాస్థితికి చేరుతుంది. లోలోపల ఉన్న జబ్బులు కూడా శాశ్వతంగా తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు.

ఆక్యు పంచర్..



ఆకాశ థెరపీలో ఆక్యుపంచర్ ప్రధానమైనది. ఇది సంప్రదాయ చైనీస్ వైద్యం. సన్నటి సూదులు వాడతారు. క్రానిక్ నొప్పులు, నిద్రలేమి, తల నొప్పులు, ఆర్థోటిక్స్ సమస్యలు తగ్గుతాయి. కండరాల వదులు అవుతాయి. అలాగే మసాజ్ ద్వారా శరీరంలో రక్తప్రసరణ పెరుగుతుంది.

హైడ్రో థెరపీ

ఈ థెరపీలో వివిధ రకాలుగా నీటిని ఉపయోగించడం ద్వారా అనారోగ్యాలకు చికిత్స చేస్తారు. నీటిని ఘనరూపంలో, ద్రవరూపంలో, ఆవిరి, మంచు రూపంలో, బాహ్యంగాను, అంతర్గతంగా చేస్తారు. స్టీమ్ బాత్, హిప్‌బాత్, స్పైనల్ బాత్ అని పలు రకాలు ఉన్నాయి. ఈ చికిత్స వల్ల తల, ఊపిరి తిత్తి,



మూత్రపిండం, జీర్ణకోశం, కాలేయానికి, కటి భాగం, ఉదర సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

'మట్టి' మహిమ..

ఈ చికిత్సా విధానంలో భూమి, నీరు, గాలి, ఎండ, ఆకాశం పంచభూతాల సాయంతో స్వస్థత చేకూరుస్తారు. అందులో ఒకటి బంకమట్టి చికిత్స. ఇది చాలా తేలికైంది. సమర్థవంతమైనది. దీనికోసం వినియోగించే మట్టి భూమి ఉపరితలం నుంచి కాకుండా 3-4 అడుగుల లోతు నుంచి తీయాల్సి ఉంటుంది. వాడేముందు బంకమట్టి ముద్దను ఎండబెట్టి, పొడిచేసి, రాళ్లను, గడ్డికి సంబంధించిన రేణువుల వంటి వాటిని, కలుషితాలను జల్లించి ఏరి అప్పుడు చికిత్సకు వాడుతారు. బంకమట్టి కడుపుపై అద్దినపుడు అజీర్ణాన్ని తొలగించి పేగు సంబం



ధిత వేడిని తగ్గించి, కడుపులో తరంగ చలన రీతిని ప్రేరేపిస్తుంది. తలనొప్పికీ దివ్యంగా పనిచేస్తుంది. మేనిఛాయ కూడా పెరుగుతుందని వైద్యులు చెబుతారు.



ఓజోన్ థెరపీ

గాలితో ప్రాణాయామాలు చేయాలి. దీన్నే ఓజోన్ థెరపీ అంటారు. దీనిద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది. శ్వాశ కోశం పనితీరు మెరుగుపడుతుంది. మనలో ఉండే చెడుగాలి బయటకు పోయి, మంచి గాలి లోపలకు వెళుతుంది.

సన్‌బాత్.

అగ్ని సంబంధ చికిత్స అంటే సన్‌లైట్, సన్‌బాత్, స్టీమ్‌బాత్, సోనా బాత్‌లు వస్తాయి. వీటి వల్ల ఆరోగ్యం మెరుగై, కీళ్ల నొప్పులు, కాళ్లు, ఒంటి నొప్పులు తగ్గుతాయి.

ఆహార లోపాల వల్లనే సమస్యలు



మనం తినే ఆహారం వల్లనే అనేక రోగాలు వస్తున్నాయి. పంచ భూతాల సాయంతో వాటికి చికిత్స చేస్తాం. ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు. చక్కగా ఆరోగ్యంగా తయారవుతారు.

– డాక్టర్ చిలుకు లక్ష్మీకాంత్, శ్రీకృష్ణ యోగా, ప్రకృతి చికిత్సాలయం

సయాటికా నొప్పి తగ్గింది..



గత మూడు నెలలుగా నాకు విపరీతమైన నడుము, సయాటికా నొప్పి ఉండేది. డాక్టర్లు ఆపరేషన్ చేయాలన్నారు. ప్రకృతి వైద్యం కోసం తెలుసుకొని చికిత్స పొందాను. ఇప్పుడు నొప్పు పూర్తిగా తగ్గింది. నడవగలుగుతున్నాను.

– కొండలరావు, చింతాడ గ్రామం

అనగనగా ఓ గోలెం



నమ్మకం

బియ్యంతో నిండుగా ఉన్న గోలెం

జలుమూరు: శ్రీముఖలింగం దక్షిణ కాశీ అని, ఇక్కడ శివలింగం ముఖం రూపం దాల్చి ఉంటుందని, శ్రీముఖలింగంలో ముఖ దర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని అందరికీ తెలుసు. కానీ ఇదే క్షేత్రంలో మరో కథ కూడా ఉంది. ఇక్కడి శివలింగం ఎంత ప్రత్యేకమో ఆ రూపం వెనక ఉండే గోలెం కూడా అంతే ప్రత్యేకం. ఈ గోలేనికి కూడా ఓ కథ ఉంది.

గోలేం కథ ఇది..

శ్రీముఖలింగం గ్రామానికి చెందిన కుమ్మరి నాగన్న ఎన్నో ఏళ్లుగా సంతానం లేకుండా బాధ పడుతుంటాడు. సంతానం కోసం స్వామిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటాడు. తనకు కుమారుడు పుడితే ఓ పెద్ద మట్టి గోలేం చేసి దాని నిండా ఆవుపాలు పోసి అభిషేకం చేస్తానని మొక్కుకుంటాడు. కొన్నాళ్లకు నాగన్నకు ఓ కుమారుడు పుడతాడు. మొక్కు చెల్లించుకోవడానికి ఓ పెద్ద మట్టి గోలేం చేసి దాని నిండా పాలుపోసి దాన్ని గర్భాలయంలోనికి తీసుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. అది గర్భ గుడి ద్వారం పట్టనంత పెద్ద గోలేం అవ్వడంతో తీసుకెళ్లలేకపోతాడు. దీంతో ఆలయం ముఖమంటపంలోనే గోలేంతోపాటు తన ఆ పరమ శివుడు ప్రసాదించిన బిడ్డను కూడా వదిలి ఇంటికి వెళ్లిపోతాడు. మర్నాడు స్వామి వారి నిత్యపూజలకై అర్చకులు గర్భగుడి తలుపులు తీసి చూడగా ఆ గోలేం మూలవిరాట్టు వెనకాల ఉంటుంది. అలాగే నాగన్నకు పుట్టిన బిడ్డకు కూడా గోలేం పక్కనే బోసినవ్వులతో ఆడుకుంటూ కనిపిస్తాడు. అప్పటి నుంచి భక్తులు తమ కోరికలు నెరవేరిన తర్వాత ఈ గోలెంలో మొక్కులు వేయడం ఆనవాయితీగా మారింది.



శ్రీముఖలింగం ప్రధాన ఆలయం

అణుకేంద్రం నిర్వాసితులకు కాలనీ నిర్మాణం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆయన శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్వాసితులతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, రహదారి, డ్రైనేజీ సమస్యలపై ప్రజల వినతుల మేరకు పరిష్కార మార్గాలు సూచించారు. కోల్డ్ స్టోరేజ్, జెట్టీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అణు విద్యుత్ కేంద్రం వస్తే కంపెనీలు వస్తాయని తెలిపారు. మిగిలిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. అణు విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తయితే ఒక్కో ఇంటికి ఒక ఉద్యోగం అవకాశం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టుకోవాలని అణు విద్యుత్ కేంద్రం యాజమాన్యానికి తెలిపారు. కొవ్వాడ, చినకొవ్వాడ, రామచంద్రాపురం, గూడేం గ్రామాలు ఎఫెక్ట్ అవుతున్నాయని బాధితులు తెలిపారు.

జాబ్‌కార్డుల మంజూరుపై దృష్టి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాబ్‌కార్డు మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హత ఉన్న వారికి జాబ్ కార్డు మంజూరు కాలేదని ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. గ్రామ సభలు నిర్వహించి జాబ్ కార్డులపై రివ్యూ నిర్వహించాలన్నారు. కొండలపై పడిన వర్షపు నీరు నిల్వ చేయడానికి చేపట్టిన పనులపై ఆరా తీశారు. వంశధార, బహుదా, నాగావళి ఓపెన్ హెడ్ చానెల్స్‌కి నీరు వెళ్లేందుకు వెజ్ రిలేటెడ్ వర్క్స్‌కి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. పనులు అడిగిన 15 రోజుల్లో పని ఇవ్వకుండా ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివాసీల ఆందోళన

జలుమూరు: మర్రివలస పంచాయతీ పరిధి ఎస్టీ మాకివలస గ్రామ మహిళలు శనివారం రాత్రి జలుమూరు పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేశారు. హరేకృష్ణ సంస్థకు చెందిన వ్యక్తులు నిత్యం భయబ్రాంతులకు గురిచేయడంతోపాటు రాత్రిపూట గ్రామంలోకి వచ్చి దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యులు రెండుసార్లు వచ్చి అధికారులకు ఆదేశాలు ఇచ్చినా తమకు పోలీసులు రక్షణ కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్టీ కమిషన్ దృష్టిలో భూవివాదం ఉండగా ఇలా దాడులకు తెగబడడం ఎంతవరకు సమంజసమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ప్రశ్నించారు. అయితే ఆ భూములు హరే కృష్ణ సంస్థకు చెందినవని, తాము సాగు చేస్తుండగా ఆదివాసీలు ఆ పంటను కోసి నూర్చడంతో అడ్డుకున్నామని, దీంతో వారే తమపై దాడులు చేశారని హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించామని జలుమూరు పోలీసులు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్నఆదివాసీలు

పోలీసు అమరవీరులను స్మరిద్దాం

- 21 నుంచి 31 వరకు స్మారకోత్సవాలు
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైమ్ : విధుల్లో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకుందామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు అట్టహాసంగా ప్రారంభిస్తామని ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

- ఈ నెల 21 ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్తూపం వద్ద ఎస్పీ ఆధ్వర్యంలో సంస్మరణ దినం నిర్వహించనున్నారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ప్రతి పీఎస్ పరిధిలో ముఖ్య కూడళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో అమరవీరులకు గుర్తుగా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారు. అదే రోజు జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలోను, 21వ తేదీ నుంచి 31 తేదీల్లో ఎచ్చెర్లలోని పోలీసు కల్యాణ మండపంలో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహిస్తారు.
- ఈ నెల 22 నుంచి 30 తేదీ మధ్య జిల్లాలోని పోలీసు అమరవీరుల గ్రామాలను డీఎస్పీలు సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి జ్ఞాపికలు అందిస్తారు. అమరులు చదివిన పాఠశాల, కళాశాలలకు వెళ్లి ఫొటోలు పెట్టి నివాళులర్పించేలా సూచించడం, గ్రామంలో ఏదైనా పాఠశాల, రోడ్డు, అభివృద్ధి పనులకు వారి పేర్లు పెట్టమని సూచించడం చేస్తారు.
- సైబర్ నేరాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ఈనెల 24న శ్రీకాకుళం, 25న కాశీబుగ్గ, 26న టెక్కలి సబ్ డివిజన్‌ల పరిధిలో వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు పోలీసులు నిర్వహిస్తారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై పోలీసు సిబ్బందికి వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు 24న టెక్కలి, 25 ఆర్మ్‌డ్ పోలీసు సిబ్బంది, 26న శ్రీకాకుళం, 27న కాశీబుగ్గ సబ్‌డివిజన్‌ల పరిధిలో ఉంటాయి.
- 26, 27 తేదీల్లో మూడు సబ్‌డివిజన్లలో దేశభక్తిని తెలిపే చిత్రాలను జిల్లావ్యాప్తంగా ప్రదర్శిస్తారు. వన్‌డే, వన్‌హోమ్ థియేటర్, వన్‌షో కార్యక్రమం 23, 25 తేదీల్లో టెక్కలి, 26, 30 తేదీల్లో కాశీబుగ్గ, 28, 29 తేదీల్లో శ్రీకాకుళం సబ్‌డివిజన్‌లో నిర్వహిస్తారు.
- బ్లడ్ డొనేషన్ క్యాంపులను 28న జిల్లా పోలీసు కార్యాలయంలో, 29న టెక్కలి సబ్‌డివిజన్, 30న కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లో నిర్వహిస్తారు.
- 29న డీఎస్పీలు, సీఐలు, పోలీసుల త్యాగాలపై ప్రముఖ వ్యక్తుల ద్వారా సెమినార్లు నిర్వహిస్తారు.
- 30న అమరవీరుల కుటుంబాల్లోని ప్రత్యేక విజయాలు సాధించినవారికి సన్మానం చేస్తారు.
- 31న జిల్లాకేంద్రంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహిస్తారు.

బిహైండ్ ది క్రైమ్

నేరాలు పెరిగాయి. నేరగాళ్లు రోజుకో పంథాను అనుసరిస్తున్నారు. పోలీసుల కళ్లుగప్పి నేరాలకు పాల్పడుతున్నారు. అయితే 'మూడోకన్ను' నుంచి మాత్రం తప్పించుకోలేకపోతున్నారు. విస్తృతమైన టెక్నాలజీ వినియోగం.. వేగవంతమైన సమాచార మార్పిడి.. పోలీసులు కేసులను త్వరగా ఛేదించేందుకు ఉపకరిస్తోంది. ఒకే రోజు మెరుపు వేగంతో రెండు రాష్ట్రాల్లో 12 గంటల వ్యవధిలో ఆరు చోరీలకు పాల్పడిన గొలుసు దొంగలకు టెక్నాలజీ సాయంతో ముకుతాడు వేయడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. ఆ నేర పరంపర.. పరిశోధన ఇతర అంశాలు బిహైండ్ ది క్రైమ్‌లో..

- కంచిలి

ఆపరేషన్ స్నాచింగ్ గ్యాంగ్



- 12 గంటల్లో 6 చైన్ స్నాచింగ్‌లు చేసిన దొంగల ముఠా
- ఆంధ్రా, ఒడిశాలో స్వైర విహారం
- చాకచక్యంగా కేసును ఛేధించిన కంచిలి, వజ్రపుకొత్తూరు ఎస్‌ఐలు

అక్టోబర్ 1

సమయం: తెల్లవారు జాము 3 గంటలు
స్థలం: ఒడిశాలోని జాజ్‌పూర్ నుంచి నలుగురు సభ్యుల ముఠా రెండు హై ఎండ్ బైక్స్‌పై ఆంధ్రా వైపు బయల్దేరింది.
సమయం: ఉదయం 9 గంటలు
స్థలం: ఇచ్ఛాపురంలో టిఫిన్ కోసం ఆగి ఇక్కడే దొంగతనం చేయాలనుకున్నా.. పరిస్థితులు అంత అనుకూలంగా లేకపోవడంతో ముందుకు సాగింది.
స్థలం: పలాస బెండిగేటు
సమయం: ఉదయం 11 గంటలు
మహిళ మెడలో మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఇది మొదటి నేరం. అనంతరం మళ్లీ ఇచ్ఛాపురం వచ్చేశారు. భోజనం చేసి



బైక్‌పై వెళుతున్న మహిళ మెడలో గొలుసును తెంపేందుకు సిద్ధమవుతున్న స్నాచింగ్ ముఠా (సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం)

మళ్లీ టార్గెట్ కోసం వెతికారు.
సమయం: సాయంత్రం 5.30 కొర్లాం జంక్షన్‌లో మహిళ మెడలో గొలుసును తెంచేసి రెండో నేరం చేశారు.

మూడో నేరం: కాశీబుగ్గ బస్టాండ్‌లో మరో మహిళ మెడలో గొలుసును తెంచేశారు.

రాత్రి 7 గంటల సమయంలో కంచిలి మండలం మకరాంపురం వద్ద ఆదివారం సంత జంక్షన్‌లో ఇద్దరు భార్యభర్తలు స్కూటీపై వెళుతుండగా మహిళ మెడలో చైన్ తెంపేయడంతో నాలుగో నేరం నమోదైంది.

- అక్కడ నుంచి ఆంధ్రా సరిహద్దు దాటి బరంపురానికి చేరుకుని రాత్రి 8.30గంటల ప్రాంతంలో మరో చైన్ స్నాచింగ్ చేశారు.
- భువనేశ్వర్‌కు చేరుకుని రాత్రి 11 గంటల వేళ నగలు(గిల్టీవి) దోపిడీ చేసి దుండగులు స్వగ్రామం జాజ్‌పూర్ చేరుకున్నారు.


మోడస్ ఆపరేండీ

నేరం చేసేందుకు దుండగులు రెండు పల్సర్ 200 బైక్‌లను వినియోగించారు. నేరానికి పాల్పడే బైక్ ముందుగా వెళ్లి 'పని' పూర్తయ్యాక వెనుక బైక్‌లో వస్తున్నవారు టీ షర్టులను తెచ్చేవారు. దొంగిలించిన సొత్తును వారికిచ్చి.. అక్కడే టీ షర్టులను మార్చుకుని విడిపోయేలా వ్యూహం రచించారు. ఆరు నేరాల్లోనూ అదే పంథా అవలంబించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఇన్వెస్టిగేషన్ పార్ట్

ఒకే రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల మధ్య రెండు రాష్ట్రాల్లో ఆరు నేరాలకు పాల్పడిన గ్యాంగ్‌పై పోలీస్ శాఖ దృష్టి సారించింది. జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి ప్రత్యేక టీంను రంగంలోకి దించారు.

- ముందుగా కరాపాడు టోల్‌గేట్ సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులకు రెండు బైక్‌లు అనుమానాస్పదంగా కనిపించాయి. వాటి నంబర్‌లు, వ్యక్తులు స్పష్టంగా కనిపించలేదు.
- పరిశోధన బృందం ఒడిశాలోని బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల కమాండ్ కంట్రోల్‌కు వెళ్లింది. అక్కడ సీసీ ఫుటేజీలను పరిశీలించింది. గంజాం ఆర్టీఓను సంప్రదించి వివరాలు సేకరించడంతో రెండు బైక్‌ల నంబర్లు ట్రేస్ అయ్యాయి. జాజ్‌పూర్‌కు చెందినవిగా ధ్రువీకరించారు.
- చిరునామాలు తెలుసుకుని కొద్ది రోజుల్లోనే వారి ఇళ్లను ముట్టడించారు.
- ప్రధాన ముద్దాయి చిన్మయ ప్రధాన్ పోలీసులకు చిక్కాడు. మిగతా ముగ్గురు పారిపోయారు. ప్రధాన్ వద్ద చోరీ సొత్తులోని ఆరున్నర తులాలు బంగారు ఆభరణాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- మిగిలిన చోరీ సొత్తు ఒకటిన్నర తులాల బంగారాన్ని ఖర్చుల నిమిత్తం మరో నిందితుడు తీసుకువెళ్లినట్లు ప్రధాన నిందితుడు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు.
- వరుస చైన్ స్నాచింగ్‌ల వ్యవహారంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి కేసులను ఛేదించిన కంచిలి, వజ్రపుకొత్తూరు ఎస్.ఐ.లు జి.రాజేష్, నిహార్‌ల బృందాన్ని ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించి సత్కరించారు.



వజ్రపుకొత్తూరు, కంచిలి ఎస్‌ఐలు నిహార్, జి.రాజేష్



నిందితులు వినియోగించిన బైక్

క్లుప్తంగా

28వ తేదీకి వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనం చెల్లింపు అంశంపై లేబర్ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదు అందగా.. సెప్టెంబర్ 12న రెండు వారాల్లో వేతనం చెల్లించాలని ఆదేశించి ఈ నెల 18వ తేదీకి వాయిదా వేశారు. తొమ్మిది నెలల వేతనం బకాయిలు ఉండగా, రెండు నెలల వేతనం వర్సిటీ అధికారులు చెల్లించారు. శనివారం విచారించిన లేబర్ కమిషన్ కార్యాలయం అసిస్టెంట్ కమిషనర్ ఈ నెల 28కి మరోసారి వాయిదా వేశారు. మిగతా ఏడు నెలల వేతన బకాయిల అంశాన్ని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి గ్రామానికి చెందిన ముద్ద చిన్నమ్మి అనే వివాహిత శనివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియలేదు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

వివాహితపై లైంగికదాడి యత్నం

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం పంచాయతీ పెదినాయుడుపేటలో ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ ప్రతిరోజూ వేకువజామున శ్రీపురం వెళ్లి కూరగాయలు తీసుకొస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం వేకువజామున 3.30 గంటలకు ఆటో తీసుకొని వెళ్లిపోగా.. ఇదే అదునుగా గ్రామానికి చెందిన తుంగాన భువనేశ్వర్ అనే వ్యక్తి ఆటో డ్రైవర్ ఇంట్లో చొరబడి అతని భార్యపై లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అప్రెంటిషిప్

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీలో డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అప్రెంటిస్‌షిప్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్, ఐటీఐ పాసైన అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 31 మధ్య www.apprenticeship.gov.in వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం నవంబర్ 7వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా వి.టి.అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08922–294906 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి



మాజీ సైనికుల కార్డులను పంపిణీ చేస్తున్న సంక్షేమాధికారి శైలజ, అధికారులు

నరసన్నపేట: జిల్లాలో తొమ్మిది వేలకు పైగా ఉన్న మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాజీ సైనికుల సంక్షేమ అధికారి ఏ.శైలజ అన్నారు. నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మాజీ సైనికుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి కార్డులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం నరసన్నపేట శాఖ చైర్మన్ సాంబశివరావు, అధ్యక్షుడు డొంకాన రమేష్, కార్యదర్శి దుప్పట్ల మురళి, ట్రెజరర్ పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ సెజ్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న పూడి చిన్నంనాయుడు(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నంనాయుడు పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం విధి నిర్వహణలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. దీంతో పరిశ్రమ అంబులెన్స్‌లో విజయనగరంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స ప్రారంభించేలోపే మృతి చెందాడు. దీంతో బంధువులు పరిశ్రమ వద్దకు మృతదేహాన్ని తీసుకువస్తుండగా పైడిభీమవరం వద్ద కందివలస గెడ్డ సమీపంలో పోలీసులు ఆపి బంధువులను దించేశారు. అనంతరం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు శవ పంచనామా నిమిత్తం తరలించారు. కాగా, చిన్నంనాయుడు మృతి పట్ల బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పరిశ్రమ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. మృతుడి స్వగ్రామం విజయనగరం జిల్లా బొండపల్లి మండలం బి.రాజేరు. ఇంకా వివాహం కాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జే.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అనుమానాస్పద కేసు నమోదు చేశారు.

కక్ష సాధింపేనా..!

- పాత కేసులో సనపల సురేష్ అరెస్టు
- 2022 నాటి కేసులో ఏ2గా ఉన్న సురేష్
- అదే కేసులో ఏ-1 ముద్దాయిగా ఉన్న కూన రవికుమార్

శ్రీకాకుళం క్రైమ్/బూర్జ :

ఇసుక అక్రమాలను వెలికి తీస్తున్నాడనే నెపంతో సనపల సురేష్ అనే వ్యక్తిని రాగోలు నుంచి వెంటాడి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అయితే కారుతో ఢీకొట్టి పలువురి ప్రమాదానికి కారణమయ్యాడని హత్యాయత్నం కింద రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు వ్యక్తుల చేత కేసులు పెట్టించారు. ఇప్పుడు ఏకంగా ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఏ-1 ముద్దాయిగా ఉన్న 2022 నాటి పాత కేసును తిరగదోసి ఏ-2 ముద్దాయిగా ఉన్న సురేష్‌ను శనివారం రాత్రి అరెస్టు చేయడం జిల్లాలో సంచలనం రేపింది. బూర్జ మండలం గుత్తావెల్లిలో సురేష్‌ను ఆయన స్వగ్రహంలోనే శ్రీకాకుళం పోలీసులు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ చూపి అరెస్టు చేశారు. అరెస్టుకు ముందు సురేష్ మీడియాతో మాట్లాడటమే టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమారే ఇదంతా చేశారని చెప్పారు.

ఆ కేసులో కూనే ఏ-1..

2022లో అప్పటి శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్‌హెచ్‌వోగా ఉన్న సీఐ ఆర్ఈసీహెచ్ ఈశ్వరప్రసాద్‌పై అప్పట్లో ఆమదాలవలస టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచితంగా ప్రవర్తించారు. దీనికి సంబంధించి కేసు (1115/22) నమోదైంది. ఆ కేసులో ఏ-1 ముద్దాయిగా కూన రవికుమార్, ఏ-2 ముద్దాయిగా సనపల సురేష్, ఏ-3గా పెంకి రాజశేఖర్ ఉన్నారు. అప్పట్లోనే ముగ్గురినీ రిమాండ్ చూపించి బెయిల్ కూడా ఇచ్చేసినట్లు అప్పటి సీఐ ఈశ్వరప్రసాద్ శనివారం రాత్రి 'సాక్షి'తో ఫోన్‌లో చెప్పారు. అదే పాత కేసుకు సంబంధించి ఇప్పుడు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ కింద గుత్తావెల్లిలో సురేష్ ఇంటివద్దకు శ్రీకాకుళం, బూర్జ పోలీసులు వెళ్లి అరెస్టు చేశారు. దీనిపై రెండో పట్టణ సీఐ గుండుమోను ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా 2022లో ప్రభుత్వాధికారిపై తిరగబడిన కేసుకు సంబంధించి రెండో ముద్దాయిగా ఉన్న సనపల సురేష్‌ను అరెస్టు చేసి శనివారం రాత్రి మెజిస్ట్రేటు ముందు హాజరుపరుస్తున్నామని చెప్పారు.



గుత్తావల్లిలో సనపల సురేష్‌కుమార్‌కు అరెస్టు చేస్తున్న శ్రీకాకుళం పోలీసులు

సురేష్ ఏం చెప్పారంటే..

'నీ కార్యకర్తగా.. నీ బాగు కోసం కష్టపడి తిరిగితే ఇప్పుడు నీకు విరోధినయ్యాను. నీవు ఏ-1 ముద్దాయిగా ఉన్న 2022 నాటి కేసులో ఏ2 ముద్దాయిగా ఉన్న నన్ను ఇప్పుడు అరెస్టు చేయిస్తావా.. నాకు వేసే శిక్ష ఇదా..? ఈ కేసుకు సంబంధించి ప్రతిసారి వాయిదాకు వెళ్తున్నాను. నాపై మొన్న జరిగిన దాడిలో తీవ్ర ఆరోగ్య సమస్యలుండటంతో ఇబ్బందికర పరిస్థితులో ఉన్నాను. ఇలాంటి సమయంలో పోలీసులు వచ్చి అరెస్టు వారెంటు చూపించారు. ఈ విషయమై నా లాయర్‌కు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఎమ్మెల్యే రవికుమార్ కక్ష కట్టి మొన్న హత్యాయత్నం కేసులు పెట్టించారు. ఆయన వెనుకున్నందుకు పాత కేసులో 353 సెక్షన్‌లో నన్ను కూడా ఏ-2 ముద్దాయిగా చేర్చారు. ప్రస్తుతం నా కళ్లకు గాయాలయ్యాయి. ఎడమ కన్నుకు 12 రోజుల్లో సర్జరీ పడుతుందని వైద్యులు చెప్పారు. కక్ష పూరితంగా వ్యవహరించిన ఎమ్మెల్యే కూనపై తెలుగుదేశం పార్టీ చర్యలు తీసుకోవాలి. తన వెనక తిరిగినందుకే నాకీ శిక్ష. పోలీసులు రిమ్స్‌కు తీసుకెళ్లి వైద్యం చేయిస్తామని చెప్పడంతో నమ్మి వెళ్తున్నాను. ఈ పోరాటంలో ఎందాకైనా వెళ్తాను. నా భార్యాపిల్లలకు ఏది జరిగినా నీదే బాధ్యత. టీడీపీ మనిషిగా పచ్చ రంగుచొక్కాతో అరెస్టు అవుతున్నాను. నాకేం జరిగినా కూనదే బాధ్యత. ఈ విషయంలో మంత్రి నారా లోకేష్, ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఆలోచించి న్యాయం చేయాలి'.. అని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్త దాడి



గాయపడిన కూన కూర్మారావు

టెక్కలి: టెక్కలి మండలం సీతాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన కూన కూర్మారావు అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై సీతాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దాడికి పాల్పడ్డాడు. గాయపడిన కూర్మారావు చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం.. శుక్రవారం రాత్రి టెక్కలి ఆర్టీసీ డిపో సమీపంలో ఓ దుకాణం వద్ద కూర్మారావు కొందరితో మాట్లాడుతూ ఉండగా.. సీతాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చింతాడ రాము హఠాత్తుగా వచ్చి వెనుక నుంచి కుర్చీతో తలపై కొట్టాడు. దీంతో కూర్మారావు కుప్పకూలిపోయాడు. ఎందుకు కొట్టావని ప్రశ్నిస్తే.. మా ఊరికి చెందిన టీడీపీ నాయకులే నిన్ను కొట్టమని చెప్పాడని కూర్మారావు పేర్కొన్నారు. దాడి అనంతరం ఆయనను టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత తనపై దాడి చేసిన టీడీపీ కార్యకర్త చింతాడ రాముతో పాటు సహకరించిన పైల చంటి, ఉప్పాడ వెంకటరమణలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ ఎన్నికలు, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున సీతాపురం పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా వ్యవహరించడంతో కక్ష కట్టి అదే పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు తనపై ఇలా దాడులు చేయిస్తున్నారని కూర్మారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకుని చర్యలు చేపట్టాలని బాధితుడు కూర్మారావు తో పాటు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

విశిష్టాధికారాలకు రాజకీయ గండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఉన్నతాధికారుల విశిష్టాధికారాలకు గండి పడుతోంది. రెవెన్యూ విభాగంలోని బదిలీల్లో ఈ విషయం సుస్పష్టమైంది. రెవెన్యూ బదిలీలు జరిగితే రాజకీయ సిఫార్సులు రావడం సర్వ సాధారణం. ప్రజా సంబంధిత పోస్టులకు నాయకులు సిఫార్సులు చేస్తుంటారు. కానీ జిల్లాలో రాజకీయ జోక్యం మరీ మితిమీరిపోతోంది. బదిలీలు చేయాల్సిన ఉన్నతాధికారుల చేతిలోని అధికారాలను కూడా కాదని రాజకీయ నాయకులు పరిమితికి మించి సిఫార్సులు చేయడం కనిపించింది. కొవ్వాడ భూసేకరణ విభాగం, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెట్ శ్రీ, లీడ్ బ్యాంకు వంటి శాఖల్లోని ప్రజా సంబంధం లేని పోస్టుల బదిలీల్లోనూ నాయకులు తలదూర్చడం చర్చనీయాంశమవుతోంది. శాఖల పనితీరు సమర్థంగా ఉండేలా ఉన్నతాధికారులు ప్రతిభావంతులను నియమించాలని అనుకుంటారు. ఆ మేరకు వారి ప్రత్యేక అధికారాలను వినియోగిస్తారు. కానీ జిల్లాలో అధికారులకు మాత్రం ఆ భాగ్యం లేకుండా పోయింది. నాయకుల మాటకు తలూపడమే పనిగా మారిపోయింది. ప్రతి విభాగంలో కొంతమంది అనారోగ్యంతో బాధ పడే వారు, ప్రత్యేక అవసరాలు ఉన్న వారు ఉంటారు. అలాంటి వారి విషయంలో జిల్లా స్థాయిలో రెవెన్యూ విభాగంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓలకు ప్రత్యేక నిర్ణయాలు తీసుకునే అధికారాలు ఉంటాయి. కానీ కూటమి పాలనలో అధికారులు వారి హక్కులు కూడా వినియోగించలేని దుస్థితికి చేరుకున్నారని పలువురు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్లు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల నియోజకవర్గంలో రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు వేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎచ్చెర్ల మండలానికి సంబంధించి సాగునీరు, ఉపాధి పనులు, రహదారులపై ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపురం రిజర్వాయర్ నుంచి వస్తున్న సాగునీటికి సమస్య లేకుండా చూడాలన్నారు. గురప్రుడెక్క, సిల్ట్ ఉండటంతో నీరు ఎచ్చెర్ల మండలానికి రావడం లేదని రైతులు కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రైలెట్‌గా తీసుకొని గురపు డెక్కలను తొలగించాలని ఈఈని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఇరిగేషన్ ఈఈ సుధాకర్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్ సంయుక్తంగా పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తిచేసిన 18 నుంచి 28 ఏళ్ల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారం, పుస్తకాలు అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు హిందీ మంచ్ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ : హిందీ మంచ్ సంస్థ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం జరగనుందని సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొంతం పార్వతీశం, రొంపివలస రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న బీకేఎస్ జూనియర్ కళాశాల వేదికగా ఉదయం 11 గంటలకు సమావేశం మొదలవుతుందని పేర్కొన్నారు. ఎల్‌పీ సెట్-2024 నోటిఫికేషన్, డీఎస్సీలో హిందీ పోస్టుల సంఖ్య పెంపు, మిగిలిన సబ్జెక్టుల మాదిరిగా రెండు హిందీ పోస్టుల కేటాయింపుతో పాటు హిందీ మంచ్ జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఉంటుందని తెలిపారు. హిందీ పండితులు, డీఎస్సీ అభ్యర్థులు, భాషాభిమానులు హాజరుకావాలని కోరారు.

అంతర్జాతీయ ఆంగ్లభాషా సదస్సుకు సుబ్రహ్మణ్యం



డి.హెచ్.సుబ్రహ్మణ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాకు చెందిన ఆంగ్ల అధ్యాపకుడు డి.హెచ్.సుబ్రహ్మణ్యం మరో ప్రతిష్టాత్మక సదస్సులో ప్రసంగించనున్నారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు అసోం రాష్ట్రం గౌహతి వేదికగా అస్సాం రాయల్ గ్లోబల్ యూనివర్సిటీలో 18వ అంతర్జాతీయ ఆంగ్లభాష సదస్సు జరగనుంది. ఇందులో జి.సిగడాం మోడల్ స్కూల్ ఆంగ్ల అధ్యాపకుడు సుబ్రహ్మణ్యం పాల్గొననున్నారు. తాను రాసిన 'ది పవర్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్ ఇన్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ లెర్నింగ్' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇటీవల ఉత్తరాంధ్రాలోనే ఏఆర్ టెక్నాలజీ ద్వారా బోధన చేసిన మొదటి వ్యక్తిగా ఈ యువ లెక్చరర్ గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను డీఈఓ తిరుమల చైతన్య, ఆర్ఐఓ పి.దుర్గారావు, డిప్యూటీ ఈవో ఆర్.విజయకుమారి, జి.సిగడాం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్, అధ్యాపకులు, సిబ్బంది శనివారం అభినందించారు.

పుస్తెలతాడు చోరీ



బాధితులు పల్లి కనకమ్మ, కృష్ణమూర్తి

మెళియాపుట్టి : ఇంట్లో వంట చేస్తున్న వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు అపహరించుకుపోయిన ఘటన మెళియాపుట్టి మండలం టకోయి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంతలక్ష్మీపురం పంచాయతీ టకోయి గ్రామానికి చెందిన పల్లికనకమ్మ అనే 65 ఏళ్ల వృద్ధురాలు శుక్రవారం రాత్రి ఇంట్లో వంట చేసుకుంటున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. కరెంట్ మెయిన్ ఆఫ్ చేసి వృద్ధురాలి మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు అపహరించుకుపోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చిచూసేసరికి పారిపోయాడు. వృద్ధురాలి ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిగాయి. భర్త కృష్ణమూర్తి గ్రామంలో ఆరుబయట కూర్చుని ఉండటంతో గమనించిన దుండగుడు ఈ దోపిడీకి పాల్పడినట్లు చెబుతున్నారు. కృష్ణమూర్తి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేశారు. కాగా, గ్రామానికి చెందిన యువకుడే ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానించి పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



పికప్ వాహనంలో ఉన్న గేదెలు

కంచిలి: ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో కొనుగోలు చేసి జలుమూరులోని నారాయణవలస సంతలో కబేలా వ్యాపారులకు అమ్మడానికి వాహనాల్లో తరలిస్తున్న గేదెలను కంచిలి పోలీసులు అడ్డుకున్నారు. పక్కా సమాచారం ప్రకారం కంచిలి జాతీయ రహదారిపై శనివారం ఉదయం పోలీసులు నిఘాపెట్టారు. ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు రెండు పికప్ వాహనాలు, సోంపేట మార్గంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మరొక పికప్ వాహనంలో మొత్తంగా 23 గేదెల్ని తరలిస్తుండగా అడ్డుకున్నారు. వీటిని తరలిస్తున్న ఆరుగురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేశామని ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. వాహనాలను సీజ్ చేశారు. గేదెల్ని కొత్తవలస గోశాలకు తరలించారు.

సెంచూరియన్‌లో 'అదితం' ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ప్రొఫెసర్ డి.ఎస్.రావు, జి.ఎస్.ఎన్.రాజు

నెల్లిమర్ల రూరల్: టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తోన్న విద్యార్థులకు ఏటా అందజేసే అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్టు ఉపకార వేతనాలను వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎస్.రావు చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పూర్వకాలంలో చదువులో ప్రతిభ చూపే విద్యార్థులకు గ్రామాల్లో వారాల బ్బాయి కింద భోజనాలు పెట్టేవారని గుర్తు చేశారు. నేడు నగదు పారితోషికం ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ ఈ ఏడాది ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న దున్న తేజ, ఫొరెన్సిక్ సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థిని కంది లావణ్యకు ఒకొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున ఉపకారవేతనాలు అందజేశారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ప్రొఫెసర్ శాంతమ్మ, ఐక్యూఏసీ హెడ్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీడయోల్, డీన్ డాక్టర్ విజయ్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, బీబీఏ విభాగాధిపతి డాక్టర్ మోహన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగే ఎన్నికలకు పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ౧ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం డీఆర్వో అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించే క్రమంలో అక్రమాలకు తావులేకుండా చూడాలని, ఆన్‌లైన్ నమోదుని సరళీకృతం చేయాలని, అవగాహన సదస్సులు నిర్వహించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు, ఫోర్టో జిల్లా చైర్మన్ పిసిని వసంతరావు, రాష్ట్రోపాధ్యా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పడాల తమ్మినాయుడు, ఎస్.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాక్షి మ్యాథ్స్-బీ పరీక్ష

- హాజరైన వివిధ పాఠశాలల బాలబాలికలు
- ముగిసిన పాఠశాల స్థాయి పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాక్షి మ్యాథ్స్-బీ పాఠశాల స్థాయి పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. తొలిరోజు స్పెల్-బి పరీక్షతోపాటు.. రెండోరోజు శనివారం మ్యాథ్స్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఏటా స్పెల్ బీ, మ్యాథ్స్ బీ కాంటెస్ట్‌లను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

2024–25 విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులను ప్రోత్సహించి, వారిలో పోటీతత్వాన్ని పెంచేందుకు సాక్షి మీడియా నడుం బిగించింది. నాలుగు దశల్లో నిర్వహిస్తున్న సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షల్లో భాగంగా మొదటి దశగా నిర్వహించే పాఠశాల స్థాయి పరీక్షలు ముగియగా.. ఇంకా జిల్లా, రీజనల్, రాష్ట్ర స్థాయిల్లో మూడు దశలుగా పరీక్షలు జరగాల్సి ఉంది.

అనూహ్య స్పందన..

జిల్లా కేంద్రంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయ పాఠశాల, పీఎన్ కాలనీలో ఉన్న న్యూసెంట్రల్ స్కూల్, బ్యాంకర్స్ కాలనీలో ఉన్న విశాఖ స్కూల్, మందస సమీపంలోని కుంటికోటలో ఉన్న కె.నారాయణ స్కూల్ తదితర పాఠశాలల్లో సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష జరిగింది. వివిధ కేటగిరీల వారీగా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాక్షి మీడియా గ్రూప్ జిల్లా ప్రతినిధుల పర్యవేక్షణలో పాఠశాల ప్రతినిధులు సమక్షంలో పరీక్ష నిర్వహించారు.




విశాఖ స్కూల్‌లో సాక్షి స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సాక్షి చొరవను మెచ్చుకుంటూ..

సాక్షి మీడియా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గురించి ప్రోత్సహించేందుకు ఏటా ముందుకు రావడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు మెచ్చుకుంటున్నారు. తమ పిల్లల భవితవ్యం కోసం సాక్షి మీడియా చేస్తున్న చొరవ ప్రసంశనీయమని కొనియాడుతున్నారు. ఈ పరీక్షలకు ప్రెజెంటింగ్ స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్' వ్యవహరించాయి. శర్వాణీ విద్యాలయ పాఠశాలలో చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో కరస్పాండెంట్ ఏ.ఆంజనేయులు, డాక్టర్ రేఖ పర్యవేక్షించారు. న్యూ సెంట్రల్ స్కూల్‌లో డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, ప్రిన్సిపాల్/రిటైర్డ్ డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు. విశాఖ స్కూల్‌లో చైర్మన్ డాక్టర్ కె.మధుసూదన్ ఆధ్వర్యంలో హెచ్ఎం పి.రామారావు, శ్రావణి, పాల్ పర్యవేక్షించారు. కె.నారాయణ స్కూల్‌లో కరస్పాండెంట్ గుంటు రోహిణమ్మ, సిబ్బంది పర్యవేక్షించారు.



న్యూ సెంట్రల్ స్కూల్‌హాల్‌లో..



శర్వాణీ పాఠశాలలో..



కె.నారాయణ స్కూల్‌లో..